క్లుప్తంగా

నేడు అన్నంపల్లి టోల్‌ప్లాజా ట్రైల్ రన్

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై నిర్మించిన టోల్ ప్లాజా ట్రైల్ రన్ నిర్వహించేందుకు హైవే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే టోల్ ప్లాజా వద్ద వివిధ వాహనాల ధరల పట్టిక, సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. 216 జాతీయ రహదారి నిర్మాణ సంస్థ టాటా కంపెనీ అధికారులు బుధవారం అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద కంప్యూటర్ సిస్టమ్, టోల్ ప్లాజా నిర్వహణపై ట్రైల్ రన్ నిర్వహించనున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ముమ్మిడివరం, అమలాపురం బైపాస్ రహదారి నిర్మాణాలు పూర్తి కావల్సి ఉంది. అవి పూర్తయ్యాక టోల్‌ప్లాజాను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నేటి నుంచి 'శాస్త్ర' టెక్నికల్ ఈవెంట్

తాళ్లరేవు: కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నుంచి 8వ తేదీ వరకు శాస్త్ర పేరిట టెక్నికల్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు కైట్ వుమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ యేడిద రామకృష్ణ తెలిపారు. వుమెన్స్ డే వారోత్సవాలలో భాగంగా శాస్త్ర (సైంటిఫిక్ అప్రోచ్ ఫర్ సోషల్ అండ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శాస్త్ర పోస్టర్‌ను కళాశాల విద్యార్థినులు మంగళవారం ఆవిష్కరించారు. కైట్ ప్రిన్సిపాల్ రేవతి, ప్రతినిధి గోపి పాల్గొన్నారు.

తాతాజీకి కిరణ్ సత్కారం



తాతాజీని పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న కిరణ్

అమలాపురం రూరల్: పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కల్వకొలను తాతాజీని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠామహోత్సవాలు



మూలమూర్తులకు నిర్వహిస్తున్న జలాధివాసం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు శివారు శ్రీ రంగనాయకపురం గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీ కోదండరామాలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠామహోత్సవాలలో భాగంగా వేద పండితులు వేంకటేశ్వర శర్మ నేతృత్వంలో ఆలయ నిర్మాణ కర్త మంతెన భువనేశ్వరీ వర్మ ఆధ్వర్యంలో సహస్ర లింగార్చన, మూలమూర్తులకు జలాధివాసము, పుష్పాధివాసము, ధాన్యాదివాసము తదితర పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ప్రతిష్ఠా కార్యక్రమం బుధవారం ఉదయం 7.30 గంటలకు నిర్వహించనున్నారు.

నీటి సమస్యను నిర్మూలిస్తాం

ఉప్పలగుప్తం: గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తానని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. మండలంలోని గొల్లవిల్లిలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాలను గుర్తించి మంగళవారం పైపులైను పనులను చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు చప్పిడి దుర్గారావు, పార్టీ నాయకులు పరమట సత్యనారాయణ, గొలకోటి దొరబాబు, జొన్నాడ చిన్ని, కార్యదర్శి పరమట సాయిబాబు పాల్గొన్నారు.

ఆటోయూనియన్ కార్యవర్గం

కాట్రేనికోన: స్థానిక గేటు సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రీసిద్ధార్థ ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. యూనియన్ అధ్యక్షుడిగా పిల్లి గోపి, ఉపాధ్యక్షుడిగా గిడ్ల గణేష్, కార్యదర్శిగా కాశి సురేష్, జాయింట్ సెక్రటరీగా ఇల్లింగి భైరవస్వామి ఎంపికయ్యారు. అనంతరం ఆటో యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ

అమలాపురం రూరల్: నల్లమిల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. నవధాన్యాలు, విత్తన గుళికలు ఏవిధంగా తయారు చేయాలో అవగాహన కల్పించారు. నవధాన్యాలు సాగు– నేలతల్లికి బాగు, నవధాన్యాల సేద్యం– పుడమి తల్లికి నైవేద్యం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. సర్పంచ్‌లు గోకరకొండ శ్రీనివాస్, గానాల భారతి, మాజీ సర్పంచ్ గోకర కొండ వెంకటస్వామి నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు పోలిశెట్టి దేవి మంగతయారు, వైస్ సర్పంచ్ వాకపల్లి శ్రీనివాస్, రైతు నాయకుడు అప్పారి చిన వెంకటరమణ ఎస్‌డీఏ సూరిబాబు, జగదీశ్వరి, జిల్లా మార్కెటింగ్ ప్రతినిధి దేవి పాల్గొన్నారు.

ఏటిగట్లపై బీటీ రోడ్డు

- కుమ్మరి కాల్వపై రహదారులు ఇక సౌకర్యవంతంగా
- అంతర్గత రోడ్లకు అనుసంధానమవుతున్న వైనం
- రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణాలు



కుమ్మరి కాల్వ శ్రీనివాస ఏటిగట్టుపై నిర్మిస్తున్న బీటీ రోడ్డు

అమలాపురం టౌన్: శిథిలమైన గ్రావెల్ రోడ్లతో అస్తవ్యస్తంగా ఉండే అమలాపురం కుమ్మరి కాల్వ ఏటిగట్లు ఇప్పుడు బ్లాక్ మెటల్ (బీటీ) రోడ్ల నిర్మాణంతో సౌకర్యవంతంగా మారుతున్నాయి. కలశం సెంటర్ వద్ద చిన్న వంతెనల కింద నుంచి పట్టణం మీదుగా పారే ఈ కుమ్మరి కాల్వకు నాలుగు వైపులా ఉన్న ఏటిగట్లపై దాదాపు రూ.రెండు కోట్ల వ్యయంతో బీటీ రోడ్లు నిర్మితమవుతున్నాయి. మంత్రి పినిపే విశ్వరూప్ కుమ్మరి కాల్వ ఏటిగట్లకు మహర్దశ పట్టిస్తున్నారు. అమలాపురం జిల్లా కేంద్రమైన క్రమంలో అంతర్గత రోడ్ల అనుసంధానాన్ని పెంచి పట్టణంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించాలన్నది వీటి అభివృద్ధి వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఇప్పటికే కుమ్మరి కాల్వ సీతాపతిరావుపేట ఏటిగట్టుపై 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.39 లక్షలతో 250 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఇక మెయిన్ రోడ్డులోని చిన్న వంతెనల నుంచి కుమ్మరి కాల్వకు అటూ ఇటూ ఉన్న ఉప్పరకాలనీ, శ్రీనివాస ఏటిగట్లపై ఇప్పుడు రూ.51 లక్షలతో బీటీ నిర్మాణం పూర్తవుతోంది. శ్రీనివాస ఏటిగట్టును రూ.27 లక్షలతో 200 మీటర్లు, ఉప్పర కాలనీ రోడ్డును రూ.24 లక్షలతో 180 మీటర్ల మేర ఆధునీకరిస్తున్నారు. చిన్న వంతెనల నుంచి కుమ్మరి కాల్వకు ఓ వైపు సీతాపతిరావుపేట ఏటిగట్టు నిర్మాణం పూర్తయితే...దానికి ఎదురుగా ఉన్న అవతల మున్సిపల్ కాలనీ వైపు ఏటిగట్టు కూడా మినీ బైపాస్ రోడ్డుగా విశ్వరూప్ మార్గ్‌గా అభివృద్ధి జరగబోతోంది. ఇప్పటికే ఈ బైపాస్ రోడ్డులో రూ.కోటి వ్యయంతో కల్వర్టుల పనులు చేపట్టారు. దీంతో పట్టణంలో కుమ్మరి కాల్వ ఏటిగట్టకు బీటీ రోడ్ల యోగం సాకారమవుతోంది. ఈ నాలుగు ఏటిగట్ల రోడ్ల అభివృద్ధి వల్ల పట్టణంలో అంతర్గత బైపాస్ రోడ్లకు మార్గం సుగమం అవుతుంది. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఉప్పర కాలనీ, శ్రీనివాస ఏటిగట్లపై నిర్మిస్తున్న బీటీ రోడ్ల పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

పెరగనున్న కనెక్టవిటీ



ముందు ముందు మినీ బైపాస్ రోడ్లుగా ఇవి అభివృద్ధి చెందనున్నాయి. ఇప్పటికే కుమ్మరి కాల్వ ఏటిగట్లపై నిర్మించే నాలుగు రోడ్లలో ఒకటి మినీ బైపాస్ రోడ్డుగా నిర్మితమవుతోంది. ఆ రోడ్లకు కనెక్టవిటీ పెరిగి పట్టణ ప్రజలు మెయిన్‌రోడ్డు మీదుగా కాకుండా ఈ అంతర్గత రోడ్ల మీదుగా వెళ్లనున్నారు.
– కొత్త అప్పలరాజు, డీఈఈ, మున్సిపాలిటీ, అమలాపురం

కలశం సెంటర్‌కు మహర్దశ



అమలాపురం పట్టణ ముఖ ద్వారం, ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు సమీపంలోనే మెయిన్‌రోడ్డులో ఉన్న కలశం సెంటర్‌కు కుమ్మరి కాల్వ ఏటిగట్ల ఆధునీకరణతో మహర్దశ పట్టనుంది. ఈ ఏటిగట్ల రోడ్లు ఇప్పుడు బీటీ రోడ్లుగా నా హయాంలో అవుతున్నందుకు ఆనందంగా ఉంది.
– దొంగ నాగ సుధారాణి, 25వ వార్డు కౌన్సిలర్, అమలాపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం పట్టణ, రూరల్ పరిధిలో బుధవారం విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈదరపల్లి శివాలయం ఏరియా, రెడ్లకాలనీ, సుబ్బరాయుడు చెరువు వడ్డిగూడెం, వడ్లమనివారి వీధి, శ్రీరామ్ నగర్, భూపయ్య అగ్రహారం, గోపాలకృష్ణ వీధి ,బీకన్న హోటల్ రోడ్,తారకరామ నగర్, ఇందుపల్లి బండారులంకలో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. 33/11 మార్కెట్‌లో కేవీ బాలయోగి ఘాట్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల పట్టణంలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.బాలయోగి ఘాట్ ఫీడర్ సావరం, విద్యుత్‌నగర్, వనచర్లవారి వీధి, గాంధీబజార్ ఫీడర్ ఏఎంజీ కాలనీ, చేపల మార్కెట్ , గోల్డ్ మార్కెట్, మహాలక్ష్మినగర్, గాంధీబజార్ గవర్నమెంటు హాస్పిటల్ ఫీడర్, దుడ్డివారి అగ్రహారం కేఎస్ఎఫ్ రోడ్డు, గవర్నమెంటు హాస్పిటల్ వెనుక, వానపల్లివారి వీధి, కనకదుర్గ వేపచెట్టు, నల్లవంతెన, ఆర్డీవో ఆఫీసు రోడ్, మొబర్లిపేట, సూర్యనారాయణపేట, నామాలవారిపాలెం, మాగం ఆక్వా చెరువుల ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి తదితరులు



సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నాయకులు

అమలాపురం టౌన్: పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించే నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు అవుతారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక సహస్ర స్కూలు (సర్ సీవీ రామన్)లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కిడ్ ట్రాపోలిస్ థీమ్ షోను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మంగళవారం ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు తమ సైన్స్ ప్రయోగాల గురించి సందర్శకులకు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి మరో అతిథిగా పాల్గొని సైన్స్ ప్రయోగాలను తిలకించారు. ఉత్తమ సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించిన విద్యార్థులకు ముఖ్య అతిథులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గోషియా బేగం ఆధ్వర్యంలో ఈ థీమ్ షో సాగింది. అనంతరం ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సూర్యనారాయణరావును స్కూలు యాజమాన్యం సత్కరించింది.

విజ్ఞానదాయకంగా సైన్స్ దినోత్సవాలు

అమలాపురం టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవం మంగవారం అమలాపురంలో పలు సంస్థలు, పాఠశాలలు విజ్ఞానదాయకంగా జరుపుకున్నాయి. జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం జరిగింది. జేవీవీ జిల్లా శాఖ అధ్యక్షుడు జనుపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెకుముకి జిల్లా కన్వీనర్ ఎస్.అబ్బులు ప్రసంగించారు. విద్యానిధి స్కూలులో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ఆ స్కూలు విద్యార్థి పిండి తనీష్‌నాయుడు తయారు చేసిన వాల్కనో (అగ్ని పర్వతం) నమూనా ఆకట్టుకుంది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వాకర్స్ హెల్త్ క్లబ్ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించింది. విద్యార్థులకు సైన్స్‌పై నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు ఆ స్కూలు హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి బహుమతులను అందజేశారు. తులిప్స్ స్కూలులో సీవీ రామన్ జయంతి జరిపారు.

ఘనంగా సైన్సు దినోత్సవం

ముమ్మిడివరం: సైన్సు, జనవిజ్ఞాన ఆవిర్భావ వేదిక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి జనవిజ్ఞాన వేదిక జెండాను ఆవిష్కరించగా విద్యార్థులు సైన్సు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్యనారాయణ, జిల్లా అకడమిక్ అండ్ చెకుముకి కన్వీనర్ నేరేడిమిల్లి అబ్బులు పాల్గొన్నారు.

యానాం: సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, గెస్ట్ స్పీకర్ కె.రాధాకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సిద్దిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్ డి.శాంతికుమార్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

అమలాపురం రూరల్: సైన్స్ మానవ వికసానికి దోహదపడుతుందని ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ కుమారశాస్త్రి అన్నారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో శాస్త్రి మాట్లాడుతూ సైన్సు విజయాలలో సీవీరామన్ పాత్ర కీలకమైందన్నారు. సంస్కృత విభాగాధిపతి డాక్టర్ వి.రాధాకృష్ణ, జంతుశాస్త్ర విభాగాధిపతి రవీంద్ర, రసాయ శాస్త్ర విభాగాధిపతి శివకుమార్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి




బహుమతులు అందజేస్తున్న విద్యాశాఖాధికారి లక్ష్మణ్ ప్రవీణ్ తదితరులు

యానాం: విద్యార్థి స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రతి ఒక్కరూ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని ప్రాంతీయవిద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో జాతీయ వైజ్ఞానిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని ప్రపంచ వైజ్ఞానిక రంగంలో భారతదేశ కీర్తి బావుటాను ఎగురవేసిన నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

రీజియన్ స్థాయి సైన్స్ క్విజ్ పోటీల విజేతలు వీరే

మాధ్యమిక స్థాయిలో ప్రథమ బహుమతిని ఎం.చైతన్యలక్ష్మి, జి.సాయిఅర్పిత, ద్వితీయ బహుమతి పీఏఎస్‌గణేష్, సీహెచ్‌ఎస్‌ఎస్ వర్ధన్, తృతీయ బహుమతిని పి.కాంచన, ఆర్.దుర్గాభవాని సాధించారు. సెకండరీ లెవెల్‌లో సీహెచ్ సింధూర, దేవచరణ్ ప్రథమ బహుమతి, పీవీఎస్ హర్షదీప్, కేజీఎస్‌నాగశ్రీ ద్వితీయ, సీహెచ్ అరుణ, ఎస్.హేమవర్షిణి తృతీయ బహుమతి సాధించారు. ఎస్ఎస్ఏ ఏడీపీసీ కె.ప్రభాకర్, హెచ్‌ఎం దంగేటి త్రిమూర్తులు, టీచర్లు పాల్గొన్నారు.

నేడు లూర్ధుమాత యాత్రా మహోత్సవం



లూర్ధుమాత కొండగుహ ఆలయం



లూర్ధుమాత విగ్రహం

మత సామరస్యానికి ప్రతీకగా ఏటా నిర్వహణ

యానాం: ఫ్రెంచి పరిపాలనా కాలంలో 1853లో నిర్మితమైన రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో ఉన్న లూర్ధుమాత కొండ గుహకు చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టత ఉంది. ఏటా మార్చి నెల మొదటి బుధవారం జరిగే లూర్ధుమాత ఉత్సవాల నిర్వహణ వెనుక అద్భుతం చోటు చేసుకుందని చరిత్ర ద్వారా తెలుస్తుంది. 1943లో బంగాళాఖాతంలో తీవ్ర తుపాను సంభవించింది. అమెరికాకు చెందిన విలియమ్ బోగ్దన్ అనే పేరు గల 1,000 టన్నుల బరువున్న ఓడ యానాంకు దగ్గర్లో 'సాక్రమెంట్ లైట్‌హౌస్'దగ్గర సముద్రం తీరంలో ఇసుకలో కూరుకుపోయింది. నౌక సిబ్బంది ఎంత ప్రయత్నించినా ఓడను సముద్రంలోకి తిరిగి లాగడం సాధ్యం కాలేదు. ఆ ఓడను తిరిగి సముద్రజలాల్లోకి లాక్కొని వెళ్లే పనిని ఇంజినీరు ఈహెచ్ స్వీనీ(అమెరికా)కి అప్పగించారు. ఆయన సైతం ప్రయత్నించి ఆఖరుకు యానాం వచ్చి కేథలిక్ చర్చిలోని లూర్ధుమాతను జపమాల ద్వారా ప్రార్థించడంతో ఓడ తిరిగి సముద్రంలోనిక వెళ్లింది. ఈ అద్భుతానికి కృతజ్ఞతగా స్వీనీ, ఆయన భార్య అల్బర్టా లాంబ్రే లూర్ధుమాత కొండగుడిని నిర్మించారు. 1957 నుంచి లూర్ధుమాత ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. లూర్ధుమాత యాత్రా మహోత్సవాల్లో యానాం, పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా మతాలకతీతంగా పాల్గొంటారు. ఈ ఉత్సవాల సందర్భంగా లూర్ధుమాత విగ్రహంతో నిర్వహించే ఊరేగింపునకు వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఈ యాత్రామహోత్సవానికి తోమాస్ పులికల్, ఫాదర్ వర్గీస్ కొల్లంపరంబి, పాలుకున్నెల్, ఒమ్మి మోహన్‌చంద్ర హాజరుకానున్నారని యానాం ఆర్‌సీఎమ్ ఫాదర్ మరియదాసు, సహాయ విచారణకర్త పి ఆనంద్ తెలిపారు.

సీఐగా శివగణేష్ సేవలు ప్రశంసనీయం



సీఐ శివగణేష్ సత్కార సభలో పాల్గొన్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతలను కాపాడటంలో తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించిన సీఐ గూటం శివగణేష్ సేవలు ప్రశంసనీయమైనవని పలువురు పేర్కొన్నారు. సుమారు 40 ఏళ్లపాటు హోమ్‌గార్డు నుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌చార్జి ఎస్పీ తదితర ఉన్నత పదవులు అధిష్ఠించి మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన శివగణేష్ ఉద్యోగ విరమణ సత్కార సభ స్థానిక పోలీస్ కాంప్లెక్స్‌లో జరిగింది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ 1983లో హోమ్‌గార్డుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి విశేషకృషితో పుదుచ్చేరి, యానాం ప్రాంతాల్లో ఎస్సై, సీఐగా నిజాయితీతో అందించిన సేవలు అత్యుత్తమమైనవని కొనియాడారు. అంతకుముందు టాపులేని జీపులో సీఐ శివగణేష్ దంపతులను యానాం వీధులలో పోలీసు సిబ్బంది ఊరేగించారు. పలు సంఘాలు ఆయనను పూలమాలలతో సత్కరించాయి. ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, పుదుచ్చేరి ఆర్డీవో కాటే ప్రభాకర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ఎస్సైలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు పాల్గొన్నారు. విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన ఎస్సై తోట వెంకటేశ్వరరావును పూలమాలలతో పలువురు సత్కరించారు.

జాతీయ చేనేత ఐక్యవేదిక కార్యవర్గ సభ్యుడిగా భాస్కరరావు



అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామానికి చెందిన చేనేత సంఘం నాయకుడు కొండా భాస్కరరావును జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ చేనేత ఐక్యవేదిక ద్వారా చేనేత కార్మికుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తారని భాస్కరరావు అన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి

యానాం: భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని, ఇంకుడు గుంతలకు ప్రాధాన్యమివ్వాలని ఆర్ఏఓ మునిస్వామి కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నెహ్రూ యువకేంద్రం, జలశక్తి శాఖ ఆధ్వర్యంలో 'క్యాచ్ ద రైన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వర్షం నీటిని వృథా చేయకుండా ప్రతి ఇంటా ఇంకుడుగుంతను తవ్వుకోవాలని, భూగర్భజలాల పెంపునకు తోడ్పడాలని కోరారు. ఎస్పీ రఘునాయగం, విద్యాశాఖాధికారి లక్ష్మణ్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణసుధాకర్ పాల్గొన్నారు.

550 మందికి వృద్ధాప్య పింఛన్లు మంజూరు

యానాం: నియోజకవర్గ పరిధిలో 550 మందికి కొత్తగా వృద్ధాప్య పింఛన్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో బుధవారం జరిగే కార్యక్రమంలో కొత్త పింఛన్లను అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా టైలర్స్ డే



టైలర్ కుటుంబానికి సాయం అందిస్తున్న మునికుమారి, బులినాని, సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ది అమలాపురం టౌన్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హో జయంతి, టైలర్స్ డే వేడుకలు స్థానిక ముస్లింవీధిలో మంగళవారం ఘనంగా జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో హితకారిణి సమాజం చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి మునికుమారి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, టైలర్, అలనాటి లవకుశ చిత్రం కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యంలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందిన అసోసియేషన్ సభ్యుడు దొమ్మేటి రాంబాబు కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. అసోసియేషన్ 9వ వార్షికోత్సవం కూడా ఇదే వేదికపై టైలర్స్ జరుపుకున్నారు. అసోసియేషన్ ముఖ్య సలహాదారులు చప్పిడి వెంకటేశ్వరరావు, కొమానపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మెన్నా వెంకటరమణ, కార్యదర్శి విత్తనాల బుల్లియ్య పాల్గొన్నారు.

తాళ్లరేవు: కోరంగి శ్రీ దుర్గా మల్లేశ్వర వృద్ధుల, అనాథ ఆశ్రమంలో మంగళవారం టైలర్స్ డే నిర్వహించారు. విలియమ్స్ హో చిత్రపటానికి టైలర్స్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆశ్రమంలోని వృద్ధులు, అనాథ బాలలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు బాషా, వనచర్ల చంద్రరావు, పితాని శ్రీకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో టైలర్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. టైలర్ పితామహుడు విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం పలు డిమాండ్‌లతో తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి వినతి పత్రం అందించారు. ఎస్.అర్జున్‌రావు, కడలి శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, వల్లభరెడ్డి సూర్యప్రకాష్, మంచెం సూర్యనారామణమూర్తి పాల్గొన్నారు.

కాట్రేనికోన: స్థానిక మావుళ్ళమ్మ ఆలయం సమీపంలో నవోదయ అభ్యుదయ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్‌డే జరుపుకున్నారు. మండల టైలర్స్ సంఘం అధ్యక్షుడు విత్తనాల వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 50 ఏళ్లు నిండిన టైలర్స్‌కు పింఛను మంజూరు చేయాలని కోరుతూ తహసిల్దారు బండి మృత్యుంజయరావుకు వినతి పత్రం అందజేశారు.

అల్లవరం: కొమరగిరిపట్నంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర టైలర్స్ సహకార సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే నిర్వహించారు. కడలి సాయిబాబు నివాసం వద్ద విలియమ్స్ హో చిత్రపటానికి టైలర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుట్టుమెషీన్ జెండాను సంఘ అధ్యక్షుడు బొక్కా విజయ్ ఆవిష్కరించారు. చంటి, సతీష్, సాయి, రాజా, వెంకటలక్ష్మి, భవాని, గణేష్, రమణ పాల్గొన్నారు. దేవగుప్తంలో సిద్ధి వినాయక టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలియమ్స్ హో జయంతి నిర్వహించారు.

యానాం: నియోజకవర్గ పరిధిలో టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ముస్లిం కల్యాణ మంటపంలో యానాం శ్రీవిఘ్నేశ్వరా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే, అసోసియేషన్ 28వ వార్షికోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి కుట్టుమెషీన్ కనుగొన్న విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అసోషియేషన్ అధ్యక్షుడు తిక్కిరెడ్డి సత్యానందం, కోపరేటివ్ అధికారి రజాక్ పాల్గొన్నారు.

సత్కారం

అమలాపురం టౌన్: ఇటీవల ఎన్నికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు నక్క చిట్టిబాబును కోనసీమ జిల్లా సంఘ ప్రతినిధులు స్థానిక దేవాంగుల వీధిలో మంగళవారం సత్కరించారు. అమలాపురం వచ్చిన చిట్టిబాబును జిల్లా సంఘం తరఫున సత్కరించి, సంఘానికి ఆయన చేస్తున్న సేవలను అభినందించినట్లు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్ తెలియజేశారు. సన్మాన కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్నయ్యదాసు, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బోడసకుర్రు బ్రిడ్జిపై రెయిలింగ్ కోసం లేఖ

అల్లవరం: వైనతేయ నదిపై బోడసకుర్రు–పాశర్లపూడి బ్రిడ్జిపై రెయిలింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ఏపీ పోలీస్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు అల్లవరం ఎస్సై శ్రీనునాయక్ మంగళవారం లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. బ్రిడ్జిపై ఆత్మహత్యలు, ప్రమాదాలు, హిట్ అండ్ రన్ కేసులు, సంఘ విద్రోహ శక్తులను అరికట్టడానికి ఈ చర్యలు అవసరమని పేర్కొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి వాహనోత్సవం

యానాం: స్థానిక శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వర స్వామి(మీసాల వెంకన్న)వారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి పంచముఖ ఆంజనేయస్వామివారి వాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. భూపతిరాజు సీతామహాలక్ష్మీ, వీర్రాజు దంపతులు ఉత్సవదారులుగా నిర్వహించిన వాహనోత్సవానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్ఏఓ మునిస్వామి హాజరై స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, వినోదాచార్యులు, సాయిరామకృష్ణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో సిద్ధి వినాయక ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకుమూడి నాగేశ్వరరావు ప్రారంభించారు. యూనియన్ ప్రెసిడెంట్ వి.ఈశ్వరరావు, కె.చిన్న, జి.లోవరాజు, జి.సుబ్రహ్మణ్యం, ఆర్.రాము, కె.ఉదయ్, రవి పాల్గొన్నారు.

దాడి చేసినవారిని అరెస్టు చేయాలి

ముమ్మిడివరం: వరంగల్‌లో బైరి నరేష్‌పై మూకుమ్మడి దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని విశ్వజనకళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక బుద్ధవిహార్ పార్క్ ఆవరణలో మంగళవారం బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేఎస్ఎన్ మూర్తి, బుడితి శరత్, కాశి వాసు, ప్రభాకర్ పాల్గొన్నారు.